

# పుణ్యఫలం

**- మల్లాది వెంకట కృష్ణమూర్తి**

తిరుమల-తిరుపతికి చెందిన ముగ్గురు ఉద్యోగస్తులు ఈ మధ్య మరణించారు. వాళ్లు స్వామివారిని ఎంతో భక్తిగా కొలిచారు కామోసు, యమధర్మరాజు వారి చిట్టాలను తిరగేసాక ఆ ముగ్గురూ స్వర్గానికి అర్హులని తేల్చాడు. వాళ్ల సంతోషానికి అవధి లేదు.

"మీరు స్వర్గంలో ఎంతకాలం వుండొచ్చో ఇప్పుడు డిసైడ్ చేద్దాం. మీరు తిరుమలలో ఏం ఉద్యోగం చేసేవారు అన్నదాన్ని బట్టి అది డిసైడ్ చేస్తాను. నా ప్రశ్నలకి మీరు జవాబులు చెప్పండి" కోరాడు యముడు.

ఆయనగారు ఏమడుగుతాడా అని వాళ్లు చెవులు రిక్కించారు.

వారిలోని ఓ అమ్మాయిని అడిగాడు యముడు-

"నువ్వు ఏం చేసేదానివమ్మా?"

"సర్. నేను టిటిడి హాస్పిటల్‌లో నర్సుగా పనిచేసేదాన్ని. రోగగ్రస్తులైన వారికి శారీరక స్వస్థత చేకూరేదాకా సేవ చేసేదాన్ని. ముఖ్యంగా బీద పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేదాన్ని."

ఆమె చెప్పింది విని, తన ముందున్న కంప్యూటర్ కీ-బోర్డులోని ఎంటర్‌ని కొట్టాడు యముడు. స్క్రీన్ వంక కాసేపు చూసి తృప్తిగా తలాడించి చెప్పాడు-

"నువ్వు చెప్పిందంతా నిజమే. నువ్వు లక్ష ఏళ్లు స్వర్గంలో వుండి స్వర్గ సుఖాలు అనుభవించు."

యమభటులు ఆమెని స్వర్గం వెళ్లే ఎయిర్‌బస్ ఎక్కించారు. యముడు రెండో వ్యక్తి వంక చూసి అడిగాడు-

"నువ్వేం చేసేవాడివబ్బాయ్?"

"అయ్యా. నేను టిటిడి స్కూల్‌లో టీచర్‌గా పనిచేసేవాణ్ణి. ఎక్కువగా బీదవారి పిల్లలు ఆ స్కూల్‌కి వచ్చేవారు. విసుక్కోకుండా వాళ్లందరికీ అర్థం అయ్యేలా నేను పాఠాలు చెప్పేవాడిని. ఒకోసారి స్కూల్ టైం అయ్యాక కూడా ప్రయివేట్ క్లాసులు తీసుకుని వాళ్లకి విద్యను నేర్పించేవాడిని. నా దగ్గర చదువుకున్న వాళ్లలో ఎందరో నేడు అమెరికాలో ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు."

యముడు కంప్యూటర్‌లో అది చెక్ చేసి తృప్తిగా తలాడించి చెప్పాడు-

"నువ్వు చెప్పింది కరెక్టేనబ్బాయ్. నీకిచ్చిన జీతానికన్నా ఎక్కువగా పనిచేసి బోలెడు పుణ్యం సాధించావు. నువ్వు కూడా స్వర్గంలో ఓ లక్ష ఏళ్లు వుండి తర్వాత తిరిగి భూమి మీద పుడతావు."

యమభటులు అతన్నీ స్వర్గానికి వెళ్లే వాహనం ఎక్కించాక యముడు మూడోవాణ్ణి ఆదరంగా చూస్తూ అడిగాడు-

"ఇప్పుడు నీ వంతు నాయనా. టిటిడిలో నువ్వు ఏ ఉద్యోగం చేసేవాడివి?"

అతను సన్నగా దగ్గి గొంతు సర్దుకుని చెప్పాడు-

"నేను స్వామివారి ఆలయంలో వుండి, దర్శనార్థం వచ్చే భక్తులు 'క్యూ'ని సక్రమంగా పాటించేలా చేసే ఉద్యోగంలో వుండేవాడిని స్వామీ."

"వెరీగుడ్. నువ్వు స్వర్గప్రాప్తికి అర్హుడివే" చెప్పాడు యమధర్మరాజు."

అతను స్వర్గంలో కాలుపెట్టింది మొదలు యమభటులు అతన్ని భుజాల మీద చేతులేసి నెడుతూ 'ఇంకెంతసేపు? జరుగు జరుగు. వెనకాల చాలామంది వున్నారు' అని బయటకి నెట్టసాగారు.